ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 18 నవంబరు 2024

గోదావరి తీరంలో కోటిలింగాలు

- ప్రాచీన చరిత్రకు ఆనవాళ్లు...
- కోటి లింగేశ్వర స్వామి ఆలయం ఉండేదని ప్రతీతి
- ఆదరణకు నోచుకోని వైనం

7


గోదావరి నది ఒడ్డు కోటి లింగాల వద్ద ఉన్న పార్వతి కొల్లుమంట

ఐదు తరగతులు...రెండు గదులు

- అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణం...
- చెట్ల కిందే విద్యార్థులకు పాఠాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

7


అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం


న్యూస్ బాక్స్

రేపు అతిథి అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

హాజీపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతి బాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అతిథి అధ్యాప కుల నియామకానికి ఈ నెల 19నడెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ సేరు శ్రీదర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్య మంలో బోధించేందుకు తెలుగు (పీజీటీ- మహిళ 1), ఇంగ్లీష్ (జేఎల్‌మహిళ 1), జువాలజీ (జేఎల్ మహిళ 1), సోషల్ (పీజీటీ జనరల్ 2, మహిళ1)సబ్జెక్టులు బోధించడానికి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 19న గుడిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో ఉదయం 9గంటలకు బయోడేటా, విద్యార్హత జిరాక్స్ పత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని అన్నారు.

కవి సమ్మేళనం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఆదివారం జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించారు. సమితి ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో దివంగత శ్రీరామోజు లక్ష్మీరాజయ్యకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. సాహితీ రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కవితాగానం చేశారు. కవులు సంతోష్, మల్లేశం, సంతోష్ పాల్గొన్నారు.



సమగ్ర సర్వేలో సందేహాలెన్నో..!

- పూర్తి సమాచారం ఇచ్చేందుకు నిరాకరణ
- వివరాల సేకరణలో ఎన్యూమరేటర్లకు ఇబ్బందులు
- అసమగ్రంగా సాగుతున్న ఇంటింటి సర్వే
- ఇంకా మొదలు కాని డేటా ఎంట్రీ

మంచిర్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటి కుటుంబ సర్వేను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, ఇతర బలహీనవర్గాల అభ్యున్నతికి సర్వే తోడ్పడుతుందని పేర్కొంది. సేకరిస్తున్న సమాచారం గోప్యంగా ఉంటుందని, ప్రజలు నిర్భయంగా తమ స్థితిగతుల వివరాలను ఎన్యూమరేటర్లకు చెప్పాలని సూచించింది. అయినా ప్రజల్లో సందేహాలు వీడటం లేదు. ఫలితంగా సర్వేలో అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. సర్వేకు వెళ్లిన అధికారులతో ప్రజలు తమ సందేహాలు, వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. సర్వేలో కొందరు వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. ముఖ్యంగా సంపన్న కుటుంబాల నుంచి భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయని ఎన్యూమరేటర్లు వాపోతున్నారు. దీంతో సర్వే ప్రక్రియలో జాప్యం జరుగుతోంది.

ఉపాధ్యాయులకు తప్పని పాట్లు

ఎన్యూమరేటర్లుగా ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, మున్సిపాలిటీ సిబ్బందిని నియమించారు. ఈనెల 9వ తేదీ నుంచి సర్వే ప్రారంభం కాగా సర్వే ఫారాలు సకాలంలో అందక కొన్ని చోట్ల ఒక రోజు ఆలస్యంగా మొదలైంది. కుటుంబ సర్వే విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఉదయం పాఠశాలకు వెళ్లి, మధ్యాహ్నం తర్వాత ఇంటింటి సర్వేకు వెళుతున్నారు. మధ్యాహ్న సమయంలో ఇళ్లలో చాలామంది అందుబాటులో ఉండకపోవడంతో వివరాల సేకరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

అయితే ఈనెల 18వ తేదీలోపు గణన పూర్తి చేయాలన్న ఆదేశాలతో చేసేది లేక వారు ఉదయం 6 గంటలకే సర్వేకు వెళ్లి 8 గంటలకు స్కూళ్లకు వెళుతున్నారు. మధ్యాహ్నం స్కూలు అయిపో గానే మళ్లీ సర్వే చేపడుతున్నారు. కొందరు ఉపాధ్యాయు లైతే రాత్రి 8 గంటల వరకు సర్వే చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల హెడ్మాస్టర్లు(ఎస్‌జీటీల)కు ఎన్యూమరేటర్ల విధులు ఇచ్చి కాంట్రాక్టు సీఆర్‌పీలను సూపర్‌వైజర్లుగా నియమించడంపై ఉపాధ్యాయుల్లో అసంతృప్తి వ్యక్తమవు తోంది. పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు (పీటీఐ)లను ఎన్యూమరే టర్లుగా నియమించగా వీరిలో చాలా మంది తమ పలుకుబడిని ఉపయోగించి విధుల్లో నుంచి మినహాయింపు పొందడంతో ఆ భారం కూడా టీచర్లపైనే పడుతోంది.

మిగతా 7లో

జిల్లాలో ప్రశాంతంగా గ్రూప్ 3 పరీక్ష

- 15,038 మంది అభ్యర్థులకు 8304 మంది హాజరు
- 55 శాతం నమోదు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం గ్రూప్ 3పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు పేపర్1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 2 పరీక్ష జరిగింది. ఉదయం పేపర్1కు 15,038 మంది అభ్యర్థులకుగాను 8304 మంది హాజరుకాగా 6734 మంది గైర్హజరయ్యారు. మధ్యాహ్నం పేపరు 2కు 15038 మందికి 8246 మంది హాజరు కాగా 6792మంది గైర్హాజర య్యారు. మొత్తం 55శాతం నమోదైంది. డీసీపీభాస్కర్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పరీక్ష కేంద్రాల బందో బస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్ష జరగనుంది.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, డీసీపీ

మొదటి రోజు గ్రూప్ 3 పరీక్ష ప్రశాంత వాతా వరణంలో సజావుగా జరిగిందని కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రతిభ జూనియర్ కళా శాల, శ్రీచైతన్య పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్ష నిర్వహణకు 48కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష నోడల్ అధి కారి, పోలీసు నోడల్ అధికారి, రీజియన్ కోఆర్డినేటర్‌లతో పాటు ప్రతీ పరీక్షకేంద్రానికి ముఖ్య పర్యవేక్షకులు, ఇన్విజి లేటర్లను నియమించామన్నారు. పరీక్ష కేంద్రంలో వైద్య, పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. హాల్ టికెట్ వెరిఫికేన్‌కు మహిళ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.


పరీక్ష కేంద్రంలో అభ్యర్థులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅర్బన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌బీహెచ్‌వీ పాఠశాల, సివి రామన్ డిగ్రీ కళాశాల, నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడి యం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను డీసీపీ భాస్కర్ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు, పరీక్ష అనంతరం ఎగ్జామ్స్ షీట్స్ స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపుపై అధికారులకు, సిబ్బందికి డీసీపీ సూచనలు చేశారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల తీగల్ పహాడ్, సింగరేణి పాలి టెక్నిక్ కళాశాల, సింగరేణి హైస్కూల్, మార్టిన్స్ గ్రామర్ స్కూల్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలల్లో నిర్వహిం చిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తర్వాత ఆలస్యంగా పరీక్ష కేంద్రానికి చేరుకున్న పలువురు అభ్యర్థులకు అధికారులు లోపలికి అనుమతించలేదు. పరీక్ష కేంద్రాలవద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను మంచిర్యాల డీసీపీ భాస్కర్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): మందమర్రిలో గ్రూప్3 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకున్నారు. పట్టణంలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2వేల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను సీఐ శశిధర్‌రెడ్డి తనిఖీ చేశారు. కార్మెట్ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ రాజశేఖర్ బందోబస్తు నిర్వ హించారు.



నస్పూర్‌లో పరీక్ష కేంద్రం వద్ద డీసీపీ భాస్కర్


మంచిర్యాలలోఅభ్యర్థులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

లక్షెట్టిపేటరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాను ఏదైనా మాట ఇస్తే కట్టుబడి పనిచేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు స్పష్టం చేశారు. లక్షెట్టిపేట విశ్రాంతి భవనం ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మితే వారం రోజుల్లో డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. యాసంగి వరి సాగుకు రైతులు సిద్ధం కావాలని, సాగుకు సరిపడ నీరందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాల్లో ఎన్నో అవకతవకలు జరిగినా స్పందించని బీజేపీ నాయకులు ఇప్పుడు కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎద్దేవాచేశారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే ఎంతటి వారినైనా వదిలి పెట్టమని హెచ్చరించారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు వారి ప్రభుత్వ హయాంలో ప్రజలను దోచుకున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు


రేణుక ఎల్లమ్మతల్లిని ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

దండేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కోర్విచెల్మలో నిర్మించిన రేణుక ఎల్లమ్మతల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కోర్విచెల్మ గ్రామానికి చెందిన కొండగొర్ల మల్లయ్య ఇల్లు ఆదివారం అగ్ని ప్రమాదంతో కాలిపోయింది. ఎమ్మెల్యే బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ఏఎంసీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, పార్టీ అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, నాయకులు గడ్డం త్రిమూర్తి, ముద్దసాని వేణు, ముత్తె వెంకటేష్, ముత్యాల శ్రీనివాస్, ముత్తె రాజన్న, ఆకుల రాజేందర్, సత్యం, కమలాకర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా దర్బార్

బెల్లంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కలెక్టర్, వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ప్రజా దర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలని పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య కోరారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

ఈ నెల 23న నర్సింగ్ పరీక్ష

గర్మిళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 23న ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించనున్నట్లు మెడికల్ హెల్త్ సర్వీసెస్ బోర్డు వెల్లడించింది. హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఉదయం 9 గంటల నుంచి 10.20 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 12.40 గంటల నుంచి 2 వరకు ఉంటుందని తెలిపింది.

సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను సందర్శించిన హెల్త్ డైరెక్టర్


డ్రగ్ స్టోర్ వద్ద వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్

గర్మిళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి మాతా శిశు సంరక్షణ కేంద్రం, సెంట్రల్ మందుల నిల్వ కేంద్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యశస్విని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్‌తో కలిసి ఆదివారం సందర్శించారు. అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ మందులు వాటి వివరాలు, బ్యాచ్ నెంబర్‌లను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఎక్స్‌పైరీ డేట్‌కు ముందున్న మందులను సెపరేట్ రిజిష్టర్‌లో మెయింటెన్ చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులను పంపించేటప్పుడు ఎక్స్‌పైరీ డేట్‌ను చూసుకోవాలన్నారు. మందుల నిల్వ కేంద్రంలో ఇతర వస్తువులను పెట్టరాదని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో సెంట్రల్ మందుల నిల్వ కేంద్రాలను, వాటికి సూపర్‌వైజర్‌లను నియమించిందన్నారు. ఉప వైద్యాధికారిణి ప్రశాంతి, ఫార్మాసిస్టులు, డీపీవో, వైద్య సిబ్బంది ఉన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి


కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

హాజీపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఆదివారం పడ్తన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి పది రోజులు దాటినా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రాలు ప్రారంభిస్తున్నారే తప్ప కొనుగోలు చేయడం లేదన్నారు. ఎలాంటి కోతలు లేకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. గడ్డం స్వామిగౌడ్, కృష్ణమూర్తి, మోటపలు కుల తిరుపతి, వెంకటరమణరావు, సత్యం, ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత

మంచిర్యాల, నవంబరు 17: జిల్లాలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఆదివారం హాజీపూర్ మండలం ర్యాలీలో 13.2 డిగ్రీలు నమోదయ్యాయి. కాసిపేట మండలంలో 14.0 డిగ్రీలు, జన్నారం మండలంలో 14.1 డిగ్రీలు, జైపూర్ మండలంలో 14.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


వేమనపల్లిలో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వేమనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం నీల్వాయి, గొర్లపల్లి గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని, వీటిని గ్రామాల్లోని అర్హులకు అందేలా స్థానిక నాయకులు, కార్యకర్తలు చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆర్. సంతోష్‌కు మార్, పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ, మాజీ సర్పంచు గాలి మధు, కాంగ్రెస్ నాయ కులు పూర్ణచంద్రరెడ్డి, తిరుపతిరెడ్డి, మధుసూదన్, రెవెన్యూ సిబ్బంది , కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. వంద పడ కల ఆసుపత్రిలో విలేకరుల సమావేశం లో మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరంలో వెయ్యి మంది పాల్గొన్నారని, ఇందులో వంద మందికి కంటి ఆపరేషన్‌లు చేయించగా మరో 200 మందికి కళ్లద్దాలను పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. రైతులు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, కూతురు వర్షతో కలిసి కళ్లద్దాలను పంపిణీ చేశారు. పట్టణాధ్యక్షుడు మల్లయ్య, కౌన్సిల ర్ బండి ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ హరీష్‌గౌడ్ , రమేష్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలి

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): ధర్మారావుపేట యాదవ సంఘానికి కమ్యూనిటీ హాలు మంజూరు చేయాలని ఆదివారం ఎమ్మెల్యే వినో ద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు ముత్యాల రాజమొగిలి మాట్లాడుతూ ధర్మారావుపేటలో అత్యధికంగా యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నారన్నారు. కమ్యూనిటీ హాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. చిలువేరు రమేష్, పవయ్య, కొమురయ్య, భీమయ్య, పాల్గొన్నారు.

భీమిని, (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరూ కల్యాణలక్ష్మీ పథకాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. రైతు వేదిక వద్ద భీమిని, కన్నెపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే పథకాలు ప్రతీ ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. భీమిని, కన్నెపల్లి మండల అధ్యక్షులు గాధం లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, సీనియర్ నాయకులు నర్సింగరావు, నాయకులు రవిందర్ రావు, మహేశ్వర్ గౌడ్, సతీష్, జగదీష్ పాల్గొన్నారు.


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బీజేపీ సభ్యత్వ నమోదు

నస్పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణంలోని సింగపూర్ పునరావాస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ సేవా కార్యక్రమాలకు ఆకర్షితులైన పలువురు బీజేపీ సభ్యత్వం స్వీకరించారని పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్రె చక్రవర్తి తెలిపారు. మల్లేష్, కిరణ్, అజయ్, నితిన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక పఠనానికి పునర్ వైభవం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. లైబ్రేరి యన్ మురళీ, స్థానికులు సాగర్, శ్రీని వాస్, సంతోష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

మందమర్రిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొన్నారంలో సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీఓ రాజేశ్వర్ ఆదివారం పరిశీలించారు. ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలను నమోదు చేయాలని సూచించారు. అధికారులు ఉన్నారు.

గిరిజనుడిపై అటవీ శాఖ అధికారుల దాడి
-పోలీసులకు ఫిర్యాదు



వేమనపల్లిలో మాట్లాడుతున్న బాధితుడు, ఆదివాసీ నాయకులు

వేమనపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చీపురు పుల్లల సేకరణకు అడవిలోకి వెళ్లిన ఓ గిరిజనుడిపై అటవీ శాఖ అధికారులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం కల్లెంపల్లి గ్రామానికి చెందిన బాధితుడు కుర్సం రవీందర్ మాట్లాడుతూ తాను, ఆత్రం బక్కయ్యతో కలిసి ఈ నెల 15న చీపురు పుల్లల సేకరణకు అడవిలోకి వెళ్లామని తెలిపారు. చీపురు పుల్లలు సేకరించిన అనంతరం లక్క కోసం మోదుగ చెట్టును నరుకుతుండగా అటవీశాఖ అధికారులు బేగ్, పాషాలు తమపై దాడికి యత్నించారు. బక్కయ్య తప్పించుకుని పారిపోగా నాపై కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేశారని తెలిపారు. అనంతరం కుష్నపల్లి రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్ళి వదిలి వేయడంతో ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నట్లు తెలిపాడు. ఆదివారం నీల్వాయి పోలీస్ స్టేషన్‌కు అటవీ శాఖ అధికారులపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం మాట్లాడుతూ గిరిజనుడిపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. దాడి చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన శ్రీరాముల అనుదీప్ (30) అనే యువకుడు శనివారం అర్ధరాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి జగన్ చాలారోజుల క్రితమే చనిపోయాడని, డ్రైవర్ పని చేసుకుంటూ తన తల్లి ఉమతో కలిసి ఉంటున్నాడు. గతంలో ఓ సారి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గాయాలపాలై చేతి వేళ్ల కోల్పోయాడు. అప్పటి నుంచి తనకు పెళ్లి కాదేమోనని మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం మద్యం సేవించిన అనుదీప్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం తల్లి చూసే సరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడని తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినీత తెలిపారు.

అటవీ ప్రాంతంలో చెట్ల నరికివేత



చెట్లను నరికి వేసిన గుర్తుతెలియని వ్యక్తులు

దండేపల్లి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కవ్వాల్ అభయారణ్యం పరిధి లింగాపూర్ బీట్ పరిధిలోని 380 కంపార్ట్‌మెంట్‌లో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 100 చెట్ల పొదళ్లను నరికివేశారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, అక్కడికి చేరుకునేలోగా వారు పారిపోయారు. నరికిన చెట్ల కొమ్మలను మెడాలను పరిశీలించారు. విషయంపై తాళ్ళపేట ఎఫ్ఆర్‌వో సుష్మరావును సంప్రదించగా గతంలో కొందరు చెట్లను నరికివేసిన చోటనే మళ్లీ ఆదివారం తెల్లవారుజామున నరికివేశారన్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



బషీరుద్దీన్ (ఫైల్)

ఆసిఫాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం ఈసుగాం పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బషీరుద్దీన్ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. 1990లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సివిల్ కానిస్టేబుల్‌గా భర్తీ అయిన బషీరుద్దీన్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హెడ్ కానిస్టేబుల్ మృతిపై ఎస్పీ డీవీ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బషీరుద్దీన్ స్వగ్రామమైన నాగర్‌కర్నూల్‌కు మృతదేహాన్ని అంత్యక్రియల కోసం కుటుంబీకులు తరలించారు.

మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

కాసిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉట్నూరులో ఈ నెల 20న నిర్వహించే తుడుందెబ్బ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య అన్నారు. ఆదివారం దేవాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలస లంబాడీల ద్వారా ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. దీన్ని నివారించేందుకు పోరాటాలు చేస్తున్నామన్నారు. ఆదివాసీ హక్కులు, సమస్యల పరిష్కారానికి నిర్వహించే సభలకు ఆదివాసీలు తరలి రావాలన్నారు. అనంతరం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. మండల ప్రధాన కార్యదర్శి కుర్సెంగ తిరుపతి, నాయకులు సిడాం శంకర్, పల్లె శ్రీను పాల్గొన్నారు

వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

మందమర్రిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేటగాళ్ల అమర్చుతున్న ఉచ్చులకు మూగ జీవాలు బలవుతున్నాయని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సారంగపల్లిలోని దుబ్బపల్లిలో ఈదునూరి శంకర్‌కు చెందిన రెండు ఎద్దులు అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి మృతిచెందాయి. దీంతో రైతు ఆర్థికంగా నష్టపోయాడు. కొందరు వేటగాళ్ల విద్యుత్ ఉచ్చులు అమర్చుతున్నారు. పొన్నారం, మామిడిగట్టు, సారంగపల్లి తదితర గ్రామాల్లో వన్య ప్రాణుల కోసం వేటగాల్లు అమర్చుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి వేటగాళ్ల అటవీ ప్రాంతాల్లో విద్యుత్ ఉచ్చులు అమర్చకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గూడెం ఆలయంలో భక్తుల రద్దీ

దండేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులతో కార్తీక సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో పలు ప్రాంతాల నుంచి తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయానికి చేరుకొని 450 మంది భక్తులు కుటుంబ సమేతంగా సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలను ఆచరించారు. ఆలయంలోని రావిచెట్టు, ప్రధానాలయం ఎదుట ఉసిరికాయలతో దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్తీక శోభతో ఆలయ పరిసర ప్రాంతమంత భక్తులతో సందడి నెలకొంది.

అత్యాశకు పోతే అంతే..!



- ఆన్‌లైన్ కంపెనీల పేరుతో ప్రకటనలు
- నిలువులా మునుగుతున్న బాధితులు

కాగజ్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా ప్రజలు ఆన్‌లైన్ సైట్లల్లో ఆర్డర్లు పెట్టి వివిధ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఏ వస్తువైనా బుక్ చేస్తే నేరుగా ఇంటికి వస్తుండటంతో ఈ వ్యాపారంపై క్రేజ్ పెరిగింది. దీన్ని కొంతమంది హ్యాకర్లు తమ అక్రమార్జనకు ఉపయోగించుకుంటున్నారు. కొంతమంది హ్యాకర్లు ఫేక్ ఫ్లిప్‌కార్ట్ సైట్‌ను రూపొందించారు. లక్షల్లో ఉన్న సెల్‌ఫోన్లు కారుచవకగా అంటే 69,000లు ఉన్న ఫోన్ కేవలం రూ.600లకే అంటూ అచ్చు ఫ్లిప్‌కార్ట్ సైట్ వలే ఆఫర్ మెసేజ్‌లు పెడుతున్నారు. ఈ ప్రకటలు కూడా రాత్రి 11నుంచి 2గంటల మధ్యలో లేదా ఉదయాన్నే పెడుతుంటారు. వాటి చూసి అత్యాశకు పోయి క్లిక్ చేస్తే అంతే సంగతులు. తీరా బుక్ చేసేందుకు వెళ్లగా కొత్తగా అడ్రస్ అడగడం చూసి కొందరు అప్రమత్తమవుతున్నారు. ఎందుకంటే ఒరిజినల్ ఫ్లిప్‌కార్ట్‌ఫోన్ యాప్‌లో మన వివరాలు ముందే అప్‌లోడ్ చేసి ఉంటాం. హ్యాకర్లు పంపే కారుచవక వస్తువును బుక్ చేసినపుడు వారు అడ్రస్ ఎంటర్ చేయాలని అంటారు. ఇది చూసి కొందరు అప్రమత్తమవుతున్నారు. తెలియని వారు చవకగా వస్తుందని నమ్మి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. అదేవిధంగా ఈ సైట్‌లో క్యాష్ ఆన్ డెలివరీ లేకపోవటం, ఒకే ఫోన్‌నెంబరుకు డబ్బులు పంపించాలని సూచిస్తుండటం తదితర వాటిని చూసి అప్రమత్తమవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. అధికారిక వెబ్‌సైట్‌లోనే ఏ వస్తువులైనా కొనుగోలు చేసుకోవాలని పేర్కొంటున్నారు. అంతేతప్ప అధికధర వస్తువులు కారుచౌకలో లభిస్తున్నాయని అత్యాశకు పోయి బుక్‌చేసుకుంటే డబ్బులు పోతాయని పేర్కొంటున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పలువురు బుక్ చేసుకొని ఆర్డర్ రాకపోవటంతో ఫేక్ అని తేలింది. బయటికి చెప్పుకుంటే నవ్వుల పాలవుతామని చెప్పుకోవటం లేదు.

బాధితురాలికి పరామర్శ

జైనూర్, నవంబరు17, (ఆంధ్రజ్యోతి): అక్టోబరు31న అత్యాచారయత్నం దాడి ఘటనలో తీవ్రగాయాలపాలైన బాధితురాలు నీలబాయిని ఆదివారం రాణి దుర్గావతి ట్రైబల్‌మహిళా సొసైటీచైర్మన్ గోడం జంగుబాయి, సభ్యులు పరామర్శించారు. బాధితురాలు ఇటీవల హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో నుంచి స్వగ్రామానికి రాగా, రెండురోజుల క్రితం దంత సర్జరీ చేయించుకుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న సొసైటీచైర్మన్ తమబృంద సభ్యులతో కలిసి నీలబాయి ఆరోగ్యం పట్ల వాకబు చేశారు. అనంతరం ఆ సొసైటీ చైర్మన్ జంగుబాయి మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, అవసరమైతే కలెక్టర్‌తో మాట్లాడి మరింత మెరుగైనవైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షురాలు ఆత్రం తులసీబాయి, ఉయిక తులసీబాయి, ఆత్రం రాంబాయి, సభ్యులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

సిర్పూర్(యు), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు కోసం ప్రత్యేకంగా కల్పించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహగాం రాయిసెంటర్ సార్మెడి ఆత్రం ఆనంద్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని మహగాంలో మండల ఆదివాసీల రాయిసెంటర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశంలో వివిధ తీర్మాణాలు చేశారు. ఆదివాసీల కోసం చేసిన చట్టాలను అదివాసీలకు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీలు విద్యపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. తీర్మాణాలు మండలంలోని ఆయా గ్రామాల్లో అమలు చేయలన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామల పటేల్‌లు మెస్రం శ్యాంరావు, తొడసం ప్రభు, ఆత్రం సంక్రుషా, ఆత్రం శ్రీరావు, తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు క్రిష్ణమాచారి

బెజ్జూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిసెంబరు 3న తలపెట్టిన చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు క్రిష్ణమాచారి కోరారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నభోజన కార్మికులకు రూ.26వేల వేతనం, నూతన విద్యావిధానం రద్దు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం నాయకులు బాయక్క, సువర్ణ, విజయ, శాంత, పద్మా, గంగుబాయి, లక్ష్మీ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి మొక్కులు తీర్చుకున్న భక్తులు



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రెబ్బెన, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రెబ్బెన ఇందిరానగర్‌లోని శ్రీ కనక దుర్గా మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం భక్తులకు ఆలయ పూజారి దేవరవినోద్ ప్రసాదాలను అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ధర్మపురి క్షేత్రంలో కార్తీక భక్తుల సందడి

- భక్తి శ్రద్ధలతో స్వామి వారికి పూజలు

ధర్మపురి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆదివారం కార్తీక భక్తుల సందడి నెలకొంది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నరసింహాడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.



స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వైభవంగా గోదావరి హారతి..

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి పదహారవరోజు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది గోదావరి వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజలు చేసి నదీ మాతకు హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ సీనియర్‌అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి

నరసింహాడి సన్నిధిలో టీవీ సీరియల్ నటుడు పూజలు..

లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ప్రముఖ టీవీసీరియల్ నటుడు మొగిలిరేకులు ఫేం సెల్వరాజ్ ఆదివారం సందర్శించారు. ఆలయంవద్ద ఆయనకు వేదపండితులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామిసన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామిశేషవస్త్రం, ప్రసాదాలుఅందించి సత్కరించారు.



లైజన్ సెల్ ఏర్పాటు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్పొరేట్ స్థాయిలో లైజన్ సెల్ ఏర్పాటు అభినందనీయమని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్‌రావు అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. లైజన్ సెల్ ఏర్పాటు గురించి తమ సంఘం ఆధ్వర్యంలో అనేకమార్లు విన్నవించగా, సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఈనెల 12న విభాగాన్ని ఏర్పాటు చేశార న్నారు. ఏవైనా సమస్యలుంటే ఏరియా సంఘానికి తెలియజేస్తే కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దివ్యాంగులు, మహిళలు, ఎస్టీలు కూడా ఈ సెల్ దృష్టికి సమస్యలు తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. త్వరలో ఆర్ఓఆర్ అమలుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో కేంద్రకమిటీ సభ్యుడు రావుల శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్‌కుమార్, బ్రాంచ్‌కార్యదర్శులు అంద వెంకటేష్, లక్ష్మణ్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వేల్పుల ప్రవీణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కుక్క వాసు, పిట్ కార్యదర్శులు వెంకటేష్, కమల్, తిరుపతి, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవచూపకపోతే సమరశీల పోరాటాలు తప్పవని ఏఐటీయూసీ మందమర్రి ఏరియా గుర్తింపుసంఘం బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సహాయకార్యదర్శి కంది శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ యాజమాన్యం ఇప్పటివరకు స్ట్రక్చర్ సమావేశాలు కూడా నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. బొగ్గుఉత్పత్తికి నాణ్యమైన పరికరాలను కార్మికులకు అందించాలని చెబుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. చలికాలం ప్రారంభమైనా కార్మికులకు వార్మ్‌కోట్లు ఇవ్వకపోవడం సరైంది కాదని మండిపడ్డారు. సమస్యలను పరిష్కరించకపోతే గనులపై ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తాము ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉంటామని తెలిపారు. నాయకులు సోంశెట్టి రాజేశం, బానయ్య, తిరుపతి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సంపత్, ప్రభాకర్ శర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంపెనీస్థాయి పోటీల్లో శ్రీరాంపూర్ ఉద్యోగుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విజేతలు

శ్రీరాంపూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరేణిస్థాయి సాంస్కృతిక పోటీల్లో శ్రీరాంపూర్ ఉద్యోగులు ప్రతిభచూపారు. ఈనెల 14,15 తేదీల్లో కొత్తగూడెం లోని రుద్రంపూర్ సీఈఆర్ క్లబ్‌లో పోటీలు జరిగాయి. ఇందులో గజల్ విభాగంలో షేక్ తాజుద్దీన్ (ఆఫీస్ అటెండెంట్), గీత్ విభాగంలో టి జంపయ్య(ఆర్‌కే న్యూటెక్, వెల్డర్), ఫ్లూట్ విభాగంలో బి రవీంద్ర కుమార్ (ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్, ఎస్‌టీపీపీ), కర్ణాటక సంగీతంలో శ్రీనిధి(జూనియర్ అసి స్టెంట్, ఎస్‌టీపీపీ) మొదటిస్థానాలు సాధించి, కోల్‌ఇండియా స్థాయిపోటీలకు ఎంపికయ్యారు. అలాగే కీబోర్డు విభాగంలో మేడ పెద్దన్న(ఈపీ ఆపరేటర్, ఇందారం ఓసీపీ), జానపద గీతాల్లో ఆర్ చంద్రమోహన్(ఈపీ ఆపరేటర్, శ్రీరాంపూర్ ఓసీపీ), హాస్యవల్లరి విభాగంలో కె సదానందం (జనరల్‌మజ్దూర్, ఆర్కే5 సీహెచ్‌పీ), కవ్వాలి గ్రూప్ విభాగంలో షేక్‌తాజుద్దీన్ బృందం రెండోస్థానం సాధించారు. ఆయాక్రీడాకారులను శ్రీరాంపూర్ ఏరియాజీఎం ఎల్‌వి సూర్యనారాయణ, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కో-ఆర్డినేటర్ సకినాల నర్సయ్య, జనరల్ కెప్టెన్ ఎం శ్రీనివాస్ అభినందించారు.

రాజకీయ జోక్యం గురించి మాట్లాడడం విడ్డూరం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాజకీయ జోక్యం పెరగలేదా అని అప్పుడు ఇది గుర్తుకు రాలేదా అన్నారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు పదేపదే ఈ విషయాన్ని ప్రస్తావించడం సరైంది కాదన్నారు. తమ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కార్మికుల ప్రయోజనాల కోసం ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారని తెలిపారు.

ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ జాయింట్ సెక్రెటరీగా మిట్ట సూర్యనారాయణ



మిట్ట సూర్యనారాయణ

మందమర్రిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ జాయింట్ సెక్రెటరీగా మందమర్రి ఏరియా కేకే5గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న మిట్ట సూర్యనారాయణ నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ ఆదివారం యూనియన్ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీసవేతనాల మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ నియామకపత్రం అందించారు. రెండున్నర దశాబ్దాలుగా యూనియన్‌లో పనిచేస్తున్న ఆయనకు ఈ పదవి రావడంతో ఆయన అనుచరులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు.

న్యూస్ బాక్స్

రేపు జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

మంచిర్యాల అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలం గుడిపేట మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో ఈనెల 19న బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తామని డీఈవో యాదయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరి ఫణిరాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సహకారంతో అండర్ 14, 17 బాలుర, బాలికల ఎంపిక చేపడుతామన్నారు. టోర్నమెంట్ కన్వీనర్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఆర్గనైజర్, పీడీ సురేష్ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. 19న ఉదయం 8 గంటలకు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ కొట్టె దేవేందర్ 8099150447 ను సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడిగా శ్రీనాథ్



నియామక పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే

బెల్లంపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఈదునూరి శ్రీనాథ్, పట్టణాధ్యక్షుడిగా అరుణ్ ప్రసాద్‌ను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నియామకం చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం వారికి నియామకపత్రాలు అందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జన్నారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా టైగర్ జోన్ పరిధిలో ఇసుక అక్రమంగా తరలించినా, నిల్వ చేసినా కేసులు తప్పవని హెచ్చరించారు.



గోదావరి నది ఒడ్డున వినాయక విగ్రహం



గోదావరి ఒడ్డున ఉన్న శివుని ఆత్మలింగం

గోదావరి తీరంలో కోటి లింగాలు



నది ఒడ్డున ఉన్న సొరంగ మార్గం

- ప్రాచీన చరిత్రకు ఆనవాళ్లు...
- కోటి లింగేశ్వర స్వామి ఆలయం ఉండేదని ప్రతీది
- ఆదరణకు నోచుకోని వైనం
- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలంటున్న గ్రామస్థులు

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మండలం నారాయణపూర్ గోదావరి నది తీరంలో కోటిలింగాలకు ఆదరణ కరువైంది. సహజ సిద్ధంగా బండరాళ్లకు వెలిసిన కోటిలింగాలు ప్రాచీన చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ ప్రాంతానికి దాదాపు 2 వేల సంవత్సరాల చరిత్ర ఉందని పురాణ గాధలు చెబుతున్నాయి. పూర్వం ఇక్కడ కోటి లింగేశ్వర స్వామి ఆలయం ఉండేదని, అది వరదల మూలంగా కొట్టుకుపోయిందని స్థానికులు చెబుతుంటారు. నాటి ఆధ్యాత్మిక వైభవాలుగా పాయిరాల కొలను, యమకోణం, వినాయకుని విగ్రహం, నంది పాదం, శివుని ఆత్మలింగం ఇప్పటికీ ఇక్కడ దర్శనమిస్తాయి. నారాయణపూర్ గోదావరి తీరానికి సమీపంలోని కత్తెరసాల గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం నుంచి కోటి లింగాల వరకు సొరంగ మార్గం ఉండేదని, ఈ సొరంగమార్గం నుంచి అగస్త్య మహాముని గోదావరి తీరం వరకు వెళ్లి అక్కడి జలాలను తీసుకువచ్చి మల్లికార్జున స్వామికి అభిషేకం చేసేవాడని అంటారు. గోదావరి తీరంలో శివుని ఆత్మలింగంతోపాటు వినాయకుని విగ్రహం ఉంటుంది.

● కోట్లాది లింగాలు

గోదావరి తీరంలో నది ఒడ్డున లెక్కకు మించిన చిన్న చిన్న శివలింగాలు అనేకం ఉన్నాయి. ఒక్కొక్క పెద్ద లింగంలో లక్షలసంఖ్యలో లింగాకారాలు దర్శనమిస్తుంటాయి. చిన్న పెద్ద కలిపితే కోటికి పైగా లెక్క తేలుతాయని అంచనా. అందుకే వీటిని కోటిలింగాలుగా పిలుచుకుంటారు.



గోదావరి నది ఒడ్డున కోటి లింగాలు

● పాయిరాల కొలను

కోటి లింగాల తీరంలో బండల కింద లోతైన మడుగు ఉంది. ఎండలు కొట్టినా, కరువు ఏర్పడినా, గోదావరి నదిలో నీరు పారకపోయినా ఈ మడుగులో మాత్రం గంగాజలం ఎప్పుడు ఉంటుంది. ఈ ప్రాంతానికి సమీపంలో దట్టమైన అడవి ఉండేదని, అప్పట్లో ఈ కొలనులో పెద్ద సంఖ్యలో పావురాళ్లు సేద తీరేవని, ఇక్కడ స్థావరాలు ఏర్పాటు చేసుకునేవని అందుకే దీనికి పాయిరాల కొలనుగా పేరు వచ్చింది.

● పార్వతి కొల్లుకుంట

పూర్వం పార్వతిదేవీ ఇక్కడి గోదావరి తీరంలో బస చేసిందని చెప్పుకుంటారు. ఆ సమయంలో కుమారుడైన వినాయకునికి నదిలో స్నానం చేయించిందట అందుకు ఉపయోగించిన పాత్రను కొల్లుకుంటగా పిలుస్తారు. ఇప్పటికీ దాన్ని మనం చూడవచ్చు.

● నంది పాదం

ఇక్కడ పెద్ద బండలపై నంది పాదముద్రలు కనిపిస్తుంటాయి. శివుడు పార్వతి కలిసి నంది వాహనంపై ఇక్కడ పర్యటించారని చెబుతుంటారు. ఆ సమయంలో నంది అడుగులు పడ్డాయని విశ్వసిస్తారు. ఇప్పటికి ఆ అడుగులు చెక్కు చెదరకుండా దర్శనమిస్తున్నాయి.

● యమకోణం

గోదావరి తీరంలోని రెండు పెద్ద బండరాళ్ల మధ్య నుంచి ఇరుకైనా సొరంగం ఉంది. దీన్ని యమకోణంగా పిలుస్తారు. ఈ కోణం మధ్య నుంచి వీగితే పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

● శివరాత్రి పర్వదినాన ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినాన ఈ ప్రాంత ప్రజలు గోదావరి తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి కోటి లింగాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

● పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

ఇంతటి ప్రాచీన చరిత్ర కలిగిన కోటి లింగాల ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతం ఎలాంటి గుర్తింపునకు నోచుకోలేదు. ఈ ప్రాంత చరిత్ర బాహ్య ప్రపంచానికి తెలియడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైన ఈ ప్రాంత ఎమ్మెల్యే, ఎంపీలు , అధికారులు స్పందించి ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

సమగ్ర సర్వేలో సందేహాలెన్నో...!

5వ పేజీ తరువాయి..

అనేక ప్రశ్నలతో ఇబ్బందులు

సర్వేలో మొత్తం 75 ప్రశ్నలు అడగాల్సి రావడంతో ఇంటి యజమానులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పైగా ఇన్ని ప్రశ్నలా? ఇవన్నీ అవసరమా? అని సర్వే సిబ్బం దిపై ప్రశ్నలు వర్షం కురిపిస్తున్నారు. కొంద రైతే వివరాలు చెప్పడానికి విసుక్కుంటున్నారు. దీంతో ఒక్కో ఇంటిని సర్వే చేయడానికి ఎన్యూమరేటర్‌కు గరిష్ఠంగా 30 నిమిషాలకన్నా ఎక్కువగానే పడుతోంది. గ్రామీణ ప్రాం తాల్లో పలు ప్రశ్నలకు ప్రజల వద్ద సమాచారం లేకపోవ డంతో వెతుక్కోవలసిన పరిస్థితి ఎదురవుతోంది. సర్వే ఫారంలో పేర్కొన్న ప్రకారం కోళ్లు, గొర్రెలు, పశువులు తదితర వివరాలు ఎందుకంటూ నిలదీస్తున్నారు.

ఏరోజు కారోజు అందజేత

పూర్తి చేసిన సర్వే ఫారాలను ఏ రోజుకారోజు ఎంపీ డీవో కార్యాలయాల్లో సూపర్‌వైజర్లకు అప్పగిస్తున్నారు. అయితే ఎన్యూమరేటర్లు వెళ్లేసరికి సూపర్‌వైజర్లలో కొందరు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు వచ్చేదాక వేచి ఉండాల్సి వస్తుం దని సమాచారం. కంప్యూటరైజ్ ప్రక్రియ ఇప్పటి వరకు ఎక్కడా ప్రారంభం కాలేదని తెలుస్తోంది.

అసమగ్రంగా సర్వే ప్రక్రియ....

సర్వేలో చాలా మంది పూర్తి వివరాలు ఇవ్వడానికి వెనుకాడుతుండటం, ఆస్తులు, ఆదాయం, భూములు, ఇతర వివరాలు ఇవ్వడం ద్వారా మున్ముందు సంక్షేమ పథకాల్లో కోత పడుతుందేమోననే అనుమానంతో గోప్యత పాటిస్తున్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా వివిధ పథకాల కింద లబ్ధి పొందిన వివరాలను చెప్పకుండా దాచేస్తున్నారు. దళిత బంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబా రక్, ఇతర పథకాల ద్వారా పొందిన సాయం విషయాన్ని దాచిపెడుతున్నారు. ఆధార్‌కార్డు వివరాలు తెలియజేయడం ఐచ్ఛికం అని చెప్పడంతో వాటిని కొందరు ఇస్తుండగా.. మరికొందరు ఇవ్వడం లేదు. ఇంటింటి సర్వేకు వెళ్లిన ఎన్యూమరేటర్లను ఎన్నికల హామీల అమలుపై నిలదీస్తున్నారు. సంప్రదాయ కులవృత్తి ద్వారానే ఉపాధి పొందుతున్న వారి వివరాలు నమోదుకు అవకాశం లేకుండాపోవడంతో ఆయా కులసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వేకు వచ్చిన ఎన్యూమరేటర్లను ఈ విషయమ్మై నిలదీస్తున్నారు. సర్వే ఫారంలో కుల వృత్తి కాలం ఎందుకు లేదని, దానిపై ఆధారపడి బతుకుతున్న వారి ఆర్థిక, ఉపాధిని ప్రభుత్వం ఎలా లెక్కిస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు.

పంటల రక్షణకు 'చేప వల'



నర్సాపూర్ శివారులో పంట చుట్టూ చేప వల కట్టిన రైతు

దండేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పంట పొలాలను అటవీ జంతువులు, పక్షుల బెడద నుంచి కాపాడుకునేందుకు రైతులు విన్నూత ఆలోచనలు చేస్తుంటారు. కొందరు గాలి వీచినప్పుడు శబ్ధం వచ్చేలా గంటలు కడుతుంటే, మరికొందరు బొమ్మలు ఏర్పాటు చేస్తారు. మరికొందరు పంటల చుట్టు రంగురంగుల చీరలను చుట్టి కాపాడుకుంటారు. నర్సాపూర్ గ్రామ శివారులో ద్వారక వైపునకు వెళ్లే రోడ్డులో ఓ రైతు పంట చుట్టూ చేపలు పట్టే వలను ఏర్పాటుచేశారు.

సీపీఎం సంతకాల సేకరణ



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బొగ్గు బావుల వేలం పాట రద్దు చేసి సింగరేణి సంస్థకే బ్లాక్‌లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఎం పార్టీ నాయకులు చెన్నూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. అనంతరం పార్టీ ఏరియా కార్యదర్శి బోడంకి చందు మాట్లాడుతూ మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు పరిశ్రమలను కార్పోరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఈ ప్రయత్నాలను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. నాయకులు శ్రీనివాస్, సమ్మక్క, నాగజ్యోతి, రేణుక, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



ఎమ్మార్పీఎస్ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం నాయకులు

దండేపల్లి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జాప్యం చేస్తూ తీవ్ర అన్యాయం చేస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగారపు మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగలు అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి వరకు న్యాయం చేయకుండా తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. వర్గీకరణ జాప్యంతో తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ఎస్సీలో 59 ఉప కులాలకు న్యాయం జరగాలని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అందరం కలిసి కట్టుగా ఉద్యమించి ఎస్సీ వర్గీకరణతోపాటు మన హక్కుల సాధనే ధ్యేయంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కార్యవర్గం ప్రకటించారు. అధ్యక్షుడిగా మంతెన నవీన్‌మాదిగ, ఉపాధ్యక్షులుగా మహేందర్, శాతరాజు రజినికాంత్, ప్రధాన కార్యదర్శిగా ఆవుల శ్రీనివాస్, కార్యదర్శిగా జూల రమేష్, ప్రచార కార్యదర్శిగా బెడిగల రమణ, కోశాధికారిగా జిల్లాపల్లి వినయ్‌రాజ్, సంయుక్త కార్యదర్శిగా శాతరాజు అంజిత్, సహాయ కార్యదర్శిగా కుశనపల్లి తిరుపతి, ముఖ్య సలహాదారులుగా లింగంపల్లి బాపు, బచ్చల అంజన్న, కొంగల నవీన్, కొంగల సుధాకర్, మల్యాల శ్రీనివాస్, గంగయ్య, బచ్చల సుబాష్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బీసీ సదస్సును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

గర్మిళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 30న జరిగే బీసీ సదస్సును విజయవంతం చేయాలని బీసీ ఐక్యవేదిక సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం బీసీ భవన్‌లో వారు మాట్లాడుతూ కుల వివక్షకు గురైన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు అందించాలని రాజ్యాంగం చెబుతుంటే రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా అగ్రవర్ణ రిజర్వేషన్‌లు వచ్చాయని తెలిపారు. సదస్సులో బీసీ సంఘాల నాయకులు, బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వడ్డేపల్లి మనోహర్, గుమ్ముల శ్రీనివాస్, రంగు రాజేశం, మల్లయ్య, అంజయ్య, చంద్రమౌళి, కొండయ్య, రాజన్న, సతీష్, అకిల్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



మందమర్రిరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మందమర్రి పట్టణానికి చెందిన అరికిళ్ల వినూత్న ప్రతిభ కనబరిచింది. కాగజ్‌నగర్‌లో జరిగిన డ్రంకెన్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో వెండి పతకం సాధించింది. ఈ సందర్భంగా వినూత్నను గ్రాండ్ మాస్టర్లు సదానందం, సంతోష్, వెంకటేష్‌లు అభినందించారు.

ఐదు తరగతులు...రెండు గదులు

- అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణం...
- చెట్ల కిందే విద్యార్థులకు పాఠాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

భీమిని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు నిరాశే మిగులుతోంది. తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో 6 వ తరగతి నుంచి పదో తరగతి వరకు 70 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో విద్యాశాఖ అదనపు గదులను మంజూరు చేసింది. హడావుడిగా శిలాఫలకం వేసిన నాయకులు నిధులు మంజూరు చేయించిన ఘనత తమదేనని గొప్పలు చెప్పి వెళ్ళిపోయారు. ఐదు సంవత్సరాలుగా శిలాఫలకం వెక్కిరిస్తుండగా విద్యార్థుల కష్టాలు అలాగే ఉన్నాయి.

వెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని 2011లో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికి ఆర్‌ఎంఎస్‌ఏ నిధులతో రూ. 31.34 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. పిల్లర్ల స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి.



వెంకటాపూర్ పాఠశాలలో చెట్ల కిందనే తరగతులు

● చెట్ల నీడలో, వరండా చదువులే...

ప్రస్తుతం వెంకటాపూర్ ఉన్నత పాఠశాలలో రెండు గదులు మాత్రమే ఉండటంతో విద్యార్థులు చెట్లకింద, వరండాల్లో విద్యనభ్యసిస్తున్నారు. కేవలం రెండు గదులే ఉండడంతో ఒకే గదిలో రెండేసి తరగతులు బోధించ వలసి వస్తుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. వర్షం పడినప్పుడు పాఠశాలలో ఒకే తరగతిలో మూడు, నాలుగుతరగతుల విద్యార్థులను కూర్చొబెట్టి బోధించాల్సి వస్తుందన్నారు. ప్రహరీ, వంట గదులు, మరుగు దొడ్లు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పాఠశాల అదనపు గదుల నిర్మాణం చేపట్టి విద్యార్థుల కష్టాలు తీర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరగతి గదులు సరిపోవడం లేదు....



మా పాఠశాలలో రెండు గదులు మాత్రమే ఉండటంతో తరగతి గదులు సరిపోవడం లేదు. అధికారులు అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేయాలి. వానా కాలంలో చాలా ఇబ్బందిగా ఉంది. పాఠశాలలో బెంచీలు లేకపోవడంతో నేలపైనే కూర్చోని చదువాల్సి వస్తుంది.

- అర్షిత్, 7 వ తరగతి, వెంకటాపూర్

పాఠాలు అర్థం కావడం లేదు....



గదులు లేకపోవడంతో ఆరుబయట చెట్ల కిందనే చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో బ్లాక్ బోర్డు లేకపోవడంతో గణితం, సైన్స్ పాఠాలు అర్థం కావడం లేదు. ఆరుబయట రెండేసి తరగతులను విద్యార్థులకు పాఠాలు బోధించడంతో ఏకాగ్రతతో చదువలేక పోతున్నాం. మూత్ర శాలలు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం.

- అంజన్న, 10 వ తరగతి, వెంకటాపూర్

గదులు లేక ఇబ్బందులు



తరగతి గదుల కొరత ఉండటంతో ఉన్న రెండు గదులతో ఇబ్బందులు పడుతున్నాం. గదుల కొరతపై ఉన్నతాధికారులకు విన్నవించాం. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేసినట్లయితే పాఠశాలకు గదుల కొరత తీరుతుంది. విద్యార్థులకు సరైన బోధన చేయలేక పోతున్నాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులను నిర్మించాలి.

-కృష్ణమూర్తి, ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడు, వెంకటాపూర్

న్యూస్ బాక్స్

నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

ఆసిఫాబాద్, నవంబరు 17: గ్రూపు-3 పరీక్షలు, సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో సోమవారం 11గంటలకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేశామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది గ్రూపు-3 పరీక్షల నిర్వహణ, సమగ్ర కుటుంబ సర్వే విధుల్లో ఉన్నందున అధికారులెవరు అందుబాటులో ఉండరన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రజావాణి దరఖాస్తులతో కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని తెలిపారు.

నేడు గ్రూపు-3 పరీక్షాకేంద్రాల పాఠశాలలకు సెలవు

ఆసిఫాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 18న జిల్లాలో గ్రూపు-3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసిన పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒకప్రకటనలో పేర్కొన్నారు. గ్రూపు-3పరీక్షలు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30గంటలవరకు పేపర్-3 పరీక్ష జరుగనున్నందున పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసిన విద్యాసంస్థలకు సెలవు ఇస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు

ఆసిఫాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మండలాల్లో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఆదివారం తిర్యాణి మండలంలోని గిన్నెధరిలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 11.8డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని మిగితా మండలాలైన సిర్పూర్(యు) మండలంలో 12.3, వాంకిడిలో 13.1, కెరమెరిలో 13.3 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఏజెన్సీ మండలాల్లోని ప్రజలు నెగళ్లు కాగుతున్నారు.



సర్ సిల్క్ భూముల్లో కబ్జా దందా

● పట్టించుకోని అధికారులు ● టెండరు పొందిన భూములనూ వదలని కబ్జాదారులు

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ మిల్లు భూముల్లో అక్రమ కట్టడాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో రాత్రికి రాత్రే కబ్జాలు చేస్తున్నారు. అనంతరం చిన్నపాటి రేకులు వేసి స్థలానికి ఇంటి నెంబరు, కరెంటు మీటరు తీసుకొచ్చి పక్కాగా నిర్మిస్తున్నారు. సర్‌సిల్క్ స్థలాల్లో భవంతులు వెలుస్తున్నా కూడా అధికారులు ఏ ఒక్కరు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే ఊహించుకోవచ్చు. సర్‌సిల్క్ మిల్లు మూతబడిన తర్వాత కార్మికులకు రావాల్సిన బకాయిల విషయంలో హైకోర్టులో 2008లో కేసు వేయటంతో 2009లో లిక్విడేటర్‌ను నియమించింది. ఈ భూములను అమ్మి కార్మికులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది.

ఇందులో రెండు బిట్లుగా విభజించి వేలం నిర్వహించగా మొత్తం 11మంది బిడ్డర్లు పాల్గొన్నారు. ఇందులో ఇద్దరికి మాత్రమే భూముల కొనుగోలుకు సంబంధించి సక్సెషన్ ఇవ్వగా హన్మకొండకు చెందిన బత్తిని వెంకట నారాయణ, కాగజ్‌నగర్‌కు చెందిన ఆనంద్ మోడి అనే ఇద్దరికి ఒక పార్శులో భూములను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. అయితే భూముల కొనుగోలు జరిగి రిజిస్ట్రేషన్ అయినా ఇప్పటి వరకు ఆ భూములను స్వాధీనం చేసి ఇవ్వకపోవటంతో చాలాచోట్ల అక్రమణలు జరిగాయి. మరికొన్ని చోట్ల అంతకుముందే శాశ్వత నిర్మాణాలు వెలిశాయి. వాటిని తొలగించి తమకు భూములను స్వాధీనం చేయాలంటూ కొనుగోలుదారుడు అధికార యంత్రాంగాన్ని ఎన్నిసార్లు ఆశ్రయించినప్పటికీ కూడా ఫలితం లేని పరిస్థితి నెలకొంది. డబ్బులు పెట్టి కొనుగోలు చేసిన భూముల్లో కూడా యథేచ్ఛగా అక్రమ కట్టాడాలు వెలుస్తున్నాయి.

ఈ క్రమంలో మరికొంత భూమి అన్యాక్రాంతం అయిపోవటంతో కొనుగోలుదారుడు మరోసారి కోర్టును ఆశ్రయించారు. ఇదీలా ఉంటే ఇదే ఫ్యాక్టరీలో కొనుగోలు చేసిన మరోబిడ్డర్ ఆనంద్ మోడికి మాత్రం 14 ఎకరాల స్థలాన్ని మ్యూటేషన్ చేసి పట్టాలు జారీ చేశారు. దీన్ని ప్రశ్నిస్తూ మొదటి కొనుగోలుదారుడు లీగల్‌గా తన హక్కులను హరించేలా వ్యవహరిస్తుండటంతో విసిగి వేసారి తాజాగా కోర్టును ఆశ్రయించటంతో కోర్టు జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవో, తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి, ఎంపీఈవో, గ్రామకార్యదర్శి, మున్సిపల్ కమిషనర్‌తోపాటు రూరల్ పోలీసులకు కలుపుకొని మొత్తం 16మందికి నోటీసులను పంపించారు.

లిక్విడేటర్ భూమిని విక్రయించిన తర్వాత కొనుగోలుదారు హక్కులను విస్మరిస్తూ స్థానిక మున్సిపల్ యంత్రాంగం రిజిస్టర్డ్ స్థలంలో మిషన్ భగీరథ రిజర్వాయర్ నిర్మించటం కూడా వివాదస్పదమైంది. దీనిపై అప్పట్లోనే బాధితుడు మున్సిపాల్టీపై కోర్టు కేసు వేయగా అది కొనసాగుతోంది. ఈ వివాదం ఉండగానే మున్సిపాల్టీ పరిధిలోకి వచ్చే ఖాళీ స్థలాలను ఆక్రమించి ఇండ్లు నిర్మించుకుంటున్నారు.

టెండరు భూములకే దిక్కు లేని పరిస్థితి..

సర్‌సిల్క్ మిల్లు మూతబడిన తర్వాత కార్మికులకు బకాయిలు చెల్లించటం కోసం భూములను విక్రయించాలని నిర్ణయించిన దరిమిలా ఈ మిల్లు పరిధిలోని మొత్తం 455ఎకరాల స్థలాన్ని విక్రయించేందుకు 2009లో లిక్విడేటర్‌ను నియమించారు. అప్పట్లో ఈవేలం పాటల్లో మొత్తం 11మంది పాల్గొనగా, ఇద్దరు కొనుగోలు చేశారు. ఇందులో వెంకటనారాయణ అనే బిడ్డర్ ఒక్కరే 186ఎకరాల భూమిని రూ.3కోట్లతో వేలంపాడి దక్కించుకున్నారు. అప్పట్లో భూమి ధరకు ఎకరాకు మూల విలువగా రూ.50వేలుగా నిర్ణయించగా, మూడురేట్లు వేలం పాటగా ఖరారు చేశారు. ఇందులో అత్యధికంగా రూ.1.55లక్షల చొప్పున చెల్లించిన వెంకట నారాయణకు 186ఎకరాలు హైకోర్టు సమక్షంలోనే సెటిల్‌మెంటు చేశారు.

ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్ కూడా 2017లో పూర్తి అయింది. అయితే ఈ స్థలాన్ని మ్యూటేషన్ చేయించుకునేందుకు కొనుగోలుదారుడు ప్రయత్నాలు ప్రారంభించగా అసలు కథ ఇక్కడే మొదలుఅయింది. ప్రస్తుతం భూముల ధర భారీగా పెరగటంతో రాజకీయ నేతల కన్ను దీనిపై పడిందన్న వాదనలు విన్పిస్తున్నాయి. ఈ క్రమంలోనే కొంత మందిని ప్రేరేపించి అక్రమణలు చేయించారన్నది కొనుగోలుదారుడి వాదన. వాటిని ఖాళీచేయించి తన భూమిని మ్యూటేషన్ చేసి స్వాధీనం చేయాలని కొనుగోలుదారుడు అటు పోలీసులను, ఇటు అధికారులను పలుమార్లు వేడుకున్నా స్పందన కరువైంది. దాంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు కూడా కొనుగోలుదారు డికి అనుకూలంగా ఆదేశాలు జారీచేసింది. అయితే కోర్టు ఉత్తర్వులను ఇప్పటి వరకు అమలు చేయకపోవటంతో బాధితుడు మరోసారి కోర్టును ఆశ్రయించాడు.


మూతబడిన సర్‌సిల్క్ మిల్లు

ప్రశాంతంగా గ్రూపు-3 పరీక్షలు

● పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ ● ఆలస్యంగా వచ్చిన ఎనిమిది మందిని అనుమతించని అధికారులు

ఆసిఫాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం గ్రూపు-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో మొత్తం 18పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 4471మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు కేటాయిం చారు. దీంతో పరీక్షా కేంద్రాలకు గంట ముందే అభ్యర్థులు చేరుకున్నారు. పోలీసులు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి పరీక్షాకేంద్రాలకు అనుమతించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 9పరీక్షా కేంద్రాల్లో 2304మంది అభ్యర్థులను, కాగజ్‌నగర్ పట్టణంలోని 9పరీక్షాకేంద్రాలలో 2167మంది అభ్యర్థులను పరీక్షలు రాసేందుకు కేటాయించారు. పేపర్-1లో 2794 మంది అభ్యర్థులు పరీక్షలురాయగా 1677మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్-2కు 2779 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా 1692మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లోని పరీక్షాకేంద్రాలను కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సందర్శించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలనిర్వహణలో భాగంగా అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి సాయిలో ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 18పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వెలుతురు, ఫ్యాన్లు, తాగునీరు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షా కేంద్రాల్లో ముఖ్య పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతఏర్పాట్లు చేపట్టామన్నారు. మొదటిరోజు పేపర్-1, పేపర్-2పరీక్షలు పూర్తైన తరువాత సంబంధిత పత్రాలను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంకు తరలించామని ఆయన పేర్కొన్నారు. వారి వెంట అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, పరీక్షల రీజనల్ కోర్డినేటర్ లక్ష్మీనర్సింహం, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా ఒకనిమిషం ఆలస్యంతోకాగజ్‌నగర్‌లో నలుగురు, ఆసిఫాబాద్‌లో నలుగురు మొత్తం ఎనిమిది మందిని అనుమతించలేదు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం గ్రూపు-3 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.35గంటల వరకు పరీక్ష హాలుకు అనుమతించారు. పట్టణంలో ఏడుకేంద్రాలను ఏర్పాటుచేశారు. బస్టాండు నుంచి వివిధ కేంద్రాలకు వెళ్లేందుకు కాగజ్‌నగర్ పోలీసులు మినీవ్యాన్‌లను ఏర్పాటు చేశారు. స్థానిక డీఎస్పీ రామానుజం, సీఐ రాజేంద్రప్రసాద్ ఏర్పాట్లను పరిశీలించారు. బస్టాండులో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశారు. ఎస్సైలు దీకొండ రమేష్, సుధాకర్ గట్టిబందోబస్తు నిర్వహించారు. చేతులు లేని దివ్యాంగుడు జాకీర్ పాషా గ్రూపు-3 పరీక్ష రాశాడు.పరీక్షకేంద్రాల్లో వికలాంగులు కోసం ప్రత్యేక వీల్‌చైర్స్‌ను ఏర్పాటు చేశారు.


ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్..

గ్రూపు-3 పరీక్ష కేంద్రాలను ఆదివారం కలెక్టర్ వెంకటేష్‌దోత్రే పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షకేంద్రాల్లోని వసతులపై ఆరాతీశారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అలాగే పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాల, సెయింట్ క్లారేట్, వసుంధర డిగ్రీకళాశాల, నవోదయ, ఫాతిమా కాన్వెంటు పాఠశాలలను పరిశీలించారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా తదితరులున్నారు.



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


కాగజ్‌నగర్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన రెండు చేతులు లేని దివ్యాంగుడు జాకీర్ పాషా


కాగజ్‌నగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు


ఆసిఫాబాద్‌లో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు, పోలీసులు

కవులు సామాజిక స్పృహ కలిగిన రచనలు చేయాలి


మాట్లాడుతున్న పరీక్షల కమిషనర్ ఉదయ్‌బాబు

ఆసిఫాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కవులు సామాజిక స్పృహ కలిగిన రచనలు చేయాలని జిల్లా ప్రభుత్వ పరీక్షల కమిషనర్ మిర్యాల ఉదయ్‌బాబు అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో 57వగ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లాకేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి ధర్మపురి వెంకటేశ్వర్లు రచించిన వసుధా శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు తమ కవితలు, రచనలు ముందు తరాలకు ఆదర్శంగా ఉండే విధంగా రచించాలని సూచించారు. మంచి రచనలు రచించిన కవులు పాఠకుల మదిలో చిరస్థాయిగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కవులు రమేష్, సత్యనారాయణ, నారాయణమూర్తి, రేవితి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాజయ్య, రాధాకృష్ణచారి, శ్రీనివాస్, రాజయ్య, ఇషాక్, శ్రీదేవి, సవిత పెంటయ్య, శీలత, చరణ్‌సాకేత్, సాయివివేక్, అమర్‌బీన్ హైమద్, సిబ్బంది సదానందం, ప్రవీణ్, స్వర్ణలత, సతిదేవి, వెంకటరమణ, సలీం, రామయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

పటిష్ఠ భద్రత మధ్య పరీక్షా పత్రాల తరలింపు


స్ట్రాంగ్ రూం నుంచి ప్రశ్నాపత్రాలను తరలిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్, నవంబరు 17: జిల్లాలో జరుగుతున్న గ్రూపు-3 పరీక్షల నిర్వహణకు స్ట్రాంగ్‌రూం నుంచి పరీక్షాపత్రాలను పటిష్ఠ భద్రత మధ్య తరలించారు. ఆదివారం కలెక్టరేట్‌లోగల స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచిన పరీక్షాప త్రాలు, ఓఎంఆర్ షీట్లను కేటాయించిన ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేసిన 18పరీక్షాకేంద్రాలకు తరలించే ప్రక్రియను అదనపుకలెక్టర్, నోడల్ అధికారి దీపక్‌తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూట్ అధికారులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రా లకు పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ షీట్లను నిర్ణీత సమ యంలో తరలించి ఆయా పరీక్షకేంద్రాల ముఖ్యపర్యవే క్షకులకు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో కేటా యించిన కేంద్రాలకు కోడ్‌ప్రకారం పత్రాలను అందజేయా లని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. మధ్యాహ్నం జరిగే పేపర్-2 ప్రశ్నపత్రాలను సైతం నిర్ణీత సమయంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పరీక్షల ప్రాంతీయసమన్వయకర్త లక్ష్మీనరసింహ, రూట్‌అధికారులు, ముఖ్య పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురి కుటుంబాలను ఆదివారం మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. మండలంలోని తుమ్మిడిహెట్టికి చెందిన సీనియర్ నాయకుడు బొల్లంపల్లి విలాస్‌గౌడ్ తండ్రి నానాగౌడ్ నాలుగు రోజుల క్రితం మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన మాజీఎంపీటీసీ బొమ్మకంటి మనీష్ తండ్రి దివాకర్ అనారోగ్యంకు గురై నాగపూర్‌లో చికిత్స చేయించుకుని రాగా బాధితుడిని పరామర్శించారు. అలాగే సీనియర్ నాయకుడు సకినాల దేవయ్య అనారోగ్యానికి గురికావడంతో ఆయన ఇంటికివెళ్లి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మాంతయ్య హనుమంతు, వెంకన్న, రాజయ్య తదితరులు ఉన్నారు.

ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలి

● సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా


సర్వే వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. ఆదివారం పట్టణంలో చేపడుతున్న సర్వేలను ఆమె పరిశీలించారు. అనంతరం ఏర్పాటు ఆమె మాట్లాడుతూ ఇంటింటి సర్వే వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సిర్పూర్(టి), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫ్మారర్ రోడ్డుకు ఆనుకుని కంచెలేకుండా ఉండడంతో ప్రమాదక రంగా ఉంది. ఈ రోడ్డు గుండా ప్రతి నిత్యం మహారాష్ట్రకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే పాఠశాలకు, కోర్టుకు వెళ్లేవారు రాక పోకలు సాగిస్తుంటారు. కంచే లేకపోవడంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు కంచే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా రావులమల్లన్న బోనాలు

దహెగాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలో ఉన్న ఆదివారం రావులమల్లన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. ప్రతిసంవత్సరం కార్తీక మాసం తరువాత వచ్చే షష్టివారాల్లో మొదటి ఆదివారం రావులమల్లన్నకు బోనాలు సమర్పించడం అనవాయితీగా వస్తోంది.

ఈసందర్భంగా దహెగాం మండలంతో పాటు కౌటాల, పెంచికలపేట, కాగజ్‌నగర్, బెజ్జూరు, భీమిని, కన్నెపల్లి, సిర్పూర్(టి) మండలాలనుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలించివచ్చి ఆలయ ప్రాంగణంలో స్వామివారికి బోనం వండి నైవేద్యం సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వ హించారు. ముఖ్యంగా ఇక్కడరాత్రి సమ యంలో బోనాలు సమర్పిస్తుండడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



బోనాలకు తరలి వచ్చిన ప్రజలు




రావులమల్లన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు